


ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 290 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 1 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/-
గురువారం 22 మే 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## 103 అమృత్ భారత్ స్టేషన్లను జాతికి అంకితమిచ్చిన మోదీ

**అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్ నుంచి వర్చువల్ ప్రారంభించారు.**

**జైపుర్, మే 22, (రిపబ్లిక్ న్యూస్):** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్ నుంచి వర్చువల్గా ప్రారంభించారు. వీటిని జాతికి అంకితమిచ్చారు. ఇందులో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి.



ఏపీలోని సూళ్లూరుపేట అమృత్ భారత్ స్టేషన్ను కూడా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత పాఠశాల విద్యార్థులతో ప్రధాని ముచ్చటించారు. యూపీలో 19. గుజరాత్లో 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్లో 8 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించారు. వరంగల్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కడియం కావ్య, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ పాల్గొన్నారు.

## ఏ పంటలు సాగు చేయాలో రైతులకు ముందే చెప్పాలి:సీఎం చంద్రబాబు

**ఏ పంటలు సాగు చేయాలో రైతులకు ముందే చెప్పాలని అధికారులకు ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు.**

**అమరావతి, మే 22, (రిపబ్లిక్ న్యూస్):** ఏ పంటలు సాగు చేయాలో రైతులకు ముందే చెప్పాలని అధికారులకు ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు. పంటలు, గిట్టుబాటు ధరలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బర్లీ పొగాకు మెట్రిక్ టన్నుకు రూ.12,000, కోకో కేజీకి రూ.500 ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు.



పొగాకు, కోకో పంటలను కంపెనీలే కొనుగోళ్లు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మద్దతు ధర కన్నా తగ్గితే రైతులను నేరుగా ఆదుకోవాలన్నారు. రైతులు నష్టపోకుండా ఈ ఏడాది హై్రీ బర్లీ పొగాకు రకానికి క్రాప్ హాలీడే ప్రకటిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. ప్యూర్ జ్యూస్లపై జీఎస్టీ తగ్గింపునకు కృషి చేస్తానని సీఎం తెలిపారు. తితిదే ప్రసాదంగా మ్యాంగో జ్యూస్ ఇవ్వాలని భావిస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు గురువారం సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర మంత్రులతో రైతుల సమస్యలపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలోనే కేబినెట్ సబ్ కమిటీతో సీఎం సమీక్ష నిర్వహించారు.

## పాక్ను మోకాళ్ల మీద కూర్చోబెట్టాం:ప్రధాని మోదీ

**ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పై దేశ ప్రజలంతా గర్విస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు.**

**మే 22, (రిపబ్లిక్ న్యూస్):** మన భద్రతా బలగాలు పాకిస్థాన్ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని రాజస్థాన్లోని బికనేర్లో మాట్లాడారు.



'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషాల్లో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్ బేస్ ఐసీయూలో ఉంది. అణుబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదు. పాక్తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు. చర్చల మాట అంటూ వస్తే.. అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే. ఉగ్రదాడి జరిగితే.. పాక్ ఆర్మీ, ఆర్థికవ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మనం స్పష్టంచేశాం. మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పార్కు ప్రవహించదు. భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదు" అని రాజస్థాన్ వేదికగా హెచ్చరికలు చేశారు. "భారత్ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ కృషి జరుగుతోంది. ఈ దిశగా గత 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేశాం. భారత రైలు నెట్వర్క్ ఆధునికీకరిస్తున్నాం. వేగం, పురోగతికి వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రతీకలు" అంటూ కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునర్నిర్మించిన దేశ్నోక్ స్టేషన్ను ప్రారంభించారు. అలాగే బికనేర్-ముంబయి ఎక్స్ప్రెస్ రైలుకు జెండా ఊపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే దేశ్నోక్లోని కర్ణిమాత ఆలయంలో పూజలు చేశారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. దానికి బదులుగా ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని ఉగ్రస్థావరాలను భారత బలగాలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.

## రన్యారావుకు 'వెడ్డింగ్ గిఫ్ట్' ఇచ్చారు:కర్ణాటక మంత్రిపై డీకే శివకుమార్ వ్యాఖ్యలు

**కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర.. నటి రన్యారావుకు వెడ్డింగ్ గిఫ్ట్ ఇచ్చారని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివ కుమార్ చేసిన వ్యాఖ్యలు వైరల్గా మారాయి.**

**బెంగళూరు, మే 22, (రిపబ్లిక్ న్యూస్):** కన్నడ నటి రన్యారావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వరకు చెందిన విద్యాసంస్థలపై ఈడీ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై కర్ణాటక రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. రన్యారావు, మంత్రి పరమేశ్వర సంస్థ మధ్య ఆర్థిక లావాదేవీలపై డీకే మాట్లాడారు. ఆ నటికి మంత్రి పెళ్లి కానుక ఇచ్చారని, అందులో తప్పేముందని అన్నారు.



బంగారం అక్రమ రవాణా కేసుకు సంబంధించి శ్రీ సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య కళాశాలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ బుధ, గురు వారాల్లో దాడులు చేసింది. ఈ కాలేజీకి మంత్రి పరమేశ్వర ఛైర్మన్ గా ఉన్నారు. ఈ కేసులో రన్యారావుకు, కళాశాలకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని ఈడీ పేర్కొంది. ఈ క్రమంలోనే నేడు హోంమంత్రి నివాసానికి డీకే శివకుమార్ వెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "ఇప్పుడే పరమేశ్వరను కలిశాను. మేం ప్రజా జీవితంలో ఉన్నాం. కొన్ని సంస్థలనూ నడుపుతున్నాం. సాధారణంగా మేం ఎంతోమందిని కలుస్తుంటాం. వారు ఏం చేస్తున్నారో మాకు ఎలా తెలుస్తుంది. ఇక, వివాహ వేడుకలకు వెళ్లినప్పుడు కూడా డబ్బులు ఇస్తుంటాం. ఇక్కడ నేను చట్టం, ఈడీ సోదాల్లో జోక్యం చేసుకోవడం లేదు. ఏం జరిగిందో వాస్తవం తెలుసుకునేందుకే ఇక్కడకు వచ్చాను. పెళ్లి సమయంలో నటికి గిఫ్ట్ ఇచ్చానని మంత్రి తెలిపారు. అది సహజమే. అందులో ఎలాంటి తప్పు లేదు" అని డీకే వ్యాఖ్యానించారు. అయితే, రన్యా రావు నేర చర్యలను ఏ రాజకీయ నేత కూడా సమర్థించడం లేదని స్పష్టం చేశారు. కాగా.. డీకే వ్యాఖ్యలపై హోంమంత్రి పరమేశ్వరను సంప్రదించగా.. "ఆ విషయం శివకుమార్నే అడగండి. నేను దర్యాప్తునకు సహకరిస్తా" అని వెల్లడించారు. రన్యారావు స్మగ్లింగ్ కేసులో రాజకీయ నేతల హస్తం ఉందనే అనుమానంతో ఇటీవల జరిగిన ఆమె వివాహానికి హాజరైన వ్యక్తులపై దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్న సంగతి తెలిసిందే. నటి పెళ్లికి హాజరైన అతిథులు, వారిచ్చిన కానుకలపై విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె వివాహ వేడుకకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హోంశాఖ మంత్రి జి.పరమేశ్వర హాజరైనట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో హోంమంత్రితో సంబంధమున్న కళాశాలపై ఈడీ దాడులు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ రన్యారావు కొన్నిరోజుల క్రితం బెంగళూరు విమానాశ్రయంలో దొరికిపోయిన విషయం తెలిసిందే. ఆమె నుంచి 14.7 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పలువురు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల పేర్లు బయటకు వచ్చాయి. ఇక, ఈ కేసులో నటికి ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ.. కాఫీపోసా చట్టం కింద నమోదైన కేసులో ఊరట దక్కలేదు.

## చెట్లు తొలగించడం కాదు..
## మొక్క నాటడం నేర్చుకోవాలి:డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**ప్రజలు ప్రకృతితో మమేకం కావాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.**



**విజయవాడ, మే 22, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజలు ప్రకృతితో మమేకం కావాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జీవ వైవిధ్య వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చెట్లు తొలగించడం కాదని.. మొక్క నాటడం నేర్చుకోవాలని చెప్పారు. ప్రకృతి నుంచి తీసుకోవడమే కాదు.. ఇవ్వడానికి అలవాటు పడాలన్నారు. సహజంగా పెరిగిన మొక్కలు మనకు అవసరం కాకపోవచ్చని.. కానీ ఇవి జీవవైవిధ్యానికి తోడ్పడతాయని వివరించారు. మన పెరట్లో ఏం చేయగలం.. జీవ వైవిధ్యానికి ఎలా తోడ్పడగలమో ఆలోచించాలని సూచించారు.

## దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్
## ప్రారంభం:కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.**

**హైదరాబాద్, మే 22, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు.



దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు. తెలిపారు. "తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్ను ప్రధాని మోదీ ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం" అని కిషన్రెడ్డి తెలిపారు.

## డిప్యూటీ సీఎం పవనన్నకు నా శుభాభినందనలు
## :మంత్రి నారా లోకేశ

**కర్ణాటక నుంచి ఏపీకి కుంకీ ఏనుగులు రప్పించిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్కు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.**

**అమరావతి, మే 22, (రిపబ్లిక్ న్యూస్):** కర్ణాటక నుంచి ఏపీకి కుంకీ ఏనుగులు రప్పించిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్కు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టు చేశారు.



"ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతు సోదరుల కష్టాలకు చెక్ పెట్టేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రప్పించిన డిప్యూటీ సీఎం పవనన్నకు నా శుభాభినందనలు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఏనుగుల విధ్వంసంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పలమనేరు ప్రాంత రైతన్నలు నా దృష్టికి తెచ్చారు. అన్నదాతల ఇక్కట్లను తొలగించేందుకు పవనన్న ప్రత్యేకంగా చొరవ చూపి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించారు. ఏపీ అవసరాలకు మరిన్ని కుంకీ ఏనుగులు ఇస్తామని హామీ ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి కూడా నా కృతజ్ఞతలు" అని లోకేశ్ పేర్కొన్నారు.

## కొత్త రేషన్ కార్డుకు మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదు:మంత్రి నాదెండ్ల మనోహర్

**రేషన్ కార్డు కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.**

**విజయవాడ, మే 22, (రిపబ్లిక్ న్యూస్):** రేషన్ కార్డు కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దరఖాస్తు స్వీకరించిన 21 రోజుల్లో దాన్ని పరిష్కరిస్తామని తెలిపారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొత్త రేషన్కార్డుకు మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరమంటూ జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు.



ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యారేజ్ సర్టిఫికెట్, పెళ్లికార్డు, పెళ్లి ఫొటో అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయొద్దని చెప్పారు. రేషన్కార్డుకు ఎవరు దరఖాస్తు చేసినా స్వీకరించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే క్షేత్ర-స్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని మంత్రి మనోహర్ సూచించారు. 4.24 కోట్ల మందికి జూన్లో ఉచితంగా రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం తమ వద్ద ఉందని.. అందులో ఎక్కడా లోపం లేదన్నారు. ప్రభుత్వం సామాన్యుడికి అందుబాటులో ఉంటూ సాంకేతికతను ఉపయోగించుకుని ముందుకెళ్తోందని చెప్పారు. క్యూఆర్ కోడ్తో స్మార్ట్ రైస్కార్డు ఇస్తామని తెలిపారు. దీనికోసం క్షేత్రసా-్థయిలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా కుటుంబసభ్యులు ఎవరైనా రేషన్కార్డులో యాడ్ చేసుకోవచ్చని తెలిపారు. తొలగింపునకు మాత్రం మరణించిన వారి పేర్లనే ప్రస్తుతానికి పరిగణనలోకి తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. కార్డులో 'హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ' మార్చేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. నమోదైన తప్పుడు వివరాలను సరిచేసేందుకు జాయింట్ కలెక్టర్ వరకు వెళ్లకుండా తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పించామని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com